క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం తనిఖీ



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న ఎంఈఓ

దొరవారిసత్రం: మావిళ్లపాడు గ్రామ పరిధిలోని ఆదర్శ పాఠశాలలో మంగళవారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని స్థానిక ఎంఈఓ కృష్ణయ్య తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థులతో కలసి భోజనం చేశారు. అనంతరం వంటశాల, పాఠశాల ఆవరణ, పాఠశాలలోని పలు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ప్రిన్సిపల్ సుమలత, ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధించాలి



ప్లాస్టిక్‌ను ఏరివేస్తున్న విద్యార్థులు

రాపూరు: ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలని యూత్ క్లబ్ అధ్యక్షుడు శివకుమార్ అన్నారు. రాపూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ప్లాస్టిక్ వాడకంపై కలిగే నష్టాలను వివరించి కళాశాల ప్రాంగణంలో ప్లాస్టిక్‌ను ఏరివేశారు. విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ నాగభూషణం

సూళ్లూరుపేట: పట్టణంలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డి.నాగభూషణం అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.ఏడుకొండలు, ఇంగ్లిష్ విభాగం హెచ్ఓడీ సునీత, జంతుశాస్త్ర విభాగాధిపతి ఎస్.శ్రీనివాస్, గణితశాస్త్ర విభాగాధిపతి డి.ఉషారాణి, అధ్యాపకులు సీహెచ్ సుబ్రమణ్యంశాస్త్రి, గౌరీశంకర్, సీహెచ్ మధుబాబు, ఆర్ శరత్‌బాబు, డాక్టర్ ఏ.బాబు పాల్గొన్నారు.

పోటాపోటీగా క్రీడా పోటీలు



బాలికల కబడ్డీ పోటీలకు టాస్ వేస్తున్న పీడీలు, పీఈటీలు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని ప్రభుత్వ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో మంగళవారం నియోజకవర్గస్థాయి క్రీడలు పోటాపోటీగా జరిగాయి. ఆరు మండలాల్లో జరిగిన మండల స్థాయి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు నాయుడుపేటలో నియోజకవర్గస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ మునిరత్నం తెలిపారు. మండల స్థాయి పోటీలను ఆయా మండల కేంద్రాల్లో జరిగినట్లు పేర్కొన్నారు. మంగళవారం బాలికలకు పోటీలు జరిగాయని, బుధవారం బాలురకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

మీ ప్రాణాలు మీ చేతుల్లోనే..



వాహనదారులకు సూచనలు చేస్తున్న సీఐ మురళీకృష్ణ

తడ: వాహనం నడిపే సమయంలో మీరు తీసుకునే జాగ్రత్తలే మీ ప్రాణాలు నిలపడంతోపాటు మీ కుటుంబంలో సంతోషాన్ని పదిలంగా ఉంచుతాయని సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ వాహనదారులకు సూచించారు. మండల పరిధిలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంతో తడ ఎస్ఐ కొండపనాయుడు, పోలీసు సిబ్బందితో కలసి సీఐ మంగళవారం మాంబట్టు సెజ్‌లోకి వెళ్లే మార్గంలో కొండూరు వద్ద వాహనాలను నిలిపి వాహనదారులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు.

హెచ్ఐవీ నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మేనేజర్

నాయుడుపేటటౌన్: పట్టణంలోని సీవీ రామన్ డిగ్రీ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు హెచ్ఐవీ నివారణ చర్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు స్థానిక నవజీవన్ ఆర్గనైజేషన్స్ కార్యక్రమాన్ని నిర్వహించింది. పట్టణంలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్రాజెక్ట్ మేనేజర్ బాలాజి ప్రిన్సిపల్ జీవీవీ గోపాల్, అధ్యాపకులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

పోలేరమ్మా.. పాహిమాం





భక్తుల కోలాహలం

- కనులవిందుగా పోలేరమ్మ తల్లి జాతర
- విద్యుత్ కాంతులతో వెలిగిపోతున్న వెంకటగిరి
- నేడు మడిభిక్షాలు

సైదాపురం/వెంకటగిరి రూరల్: వెంకటగిరి గ్రామశక్తి స్వరూపిణి పోలేరమ్మ జాతరలో భాగంగా వెంకటగిరి విద్యుత్‌కాంతులతో విరాజిల్లుతోంది. అమ్మవారి ఘటోత్సవం నుంచి ప్రతిరోజూ వెంకటగిరిలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను కనువిందుచేస్తున్నాయి.

విద్యుత్ కాంతులతో..

పోలేరమ్మ జాతరలో భాగంగా వెంకటగిరి పట్టణమంతా విద్యుత్ దీపకాంతులతో మెరిసిపోతోంది. ఏ వీధిలో చూసినా అమ్మవారి ప్రతిమతో కూడిన పెద్దపెద్ద కటౌట్‌లను ఏర్పాటు చేసి, పట్టమంతా లైటింగ్‌ను ఏర్పాటు చేయడంతో విద్యుత్ కాంతులతో వెంకటగిరి వెలిగిపోతుంది.

నేడు బోనాల కోలాటం..

డ్రమ్స్ వాయిద్యాలు, క్రాకర్స్‌షో

జాతరను పురస్కరించుకొని బుధవారం వరంగల్ బోనాల కోలాటం, డ్రమ్స్ వాయిద్యాలు నృత్యాలు వేడుకలు పట్టణంలో జరగనున్నాయి. పాత బస్టాండ్ సమీపంలోని పాత వీఆర్‌జేసీ కళాశాల ప్రాంగణంలో రాత్రి 8గంటలకు భారీ క్రాకర్స్‌షో ప్రదర్శించనున్నారు.

పోటెత్తనున్న భక్తులు..

వెంకటగిరి జాతరకు లక్షలాదిమంది భక్తజనం పోటెత్తుతుంటారు. ఈక్రమంలో బుధ, గురువారాల్లో పోలేరమ్మ జనజాతర కోలాహలంగా ప్రారంభం కానుంది. అమ్మవారి పుట్టినిల్లు నుంచి మెట్టినిల్లు వరకు అత్యంత వైభవంగా పూల అలంకరణతో ఏర్పాటు చేసిన ప్రత్యేక రథంలో అమ్మవారిని ఊరేగింపుగా దేవస్థానం వద్దకు తీసుకొస్తారు. అనంతరం గురువారం ఉదయం నుంచి భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పిస్తారు.

దర్శనం క్యూలు ఇలా..

పోలేరమ్మ దర్శనార్థం ప్రత్యేక బారికేడ్లను ఏర్పాటు చేసి దర్శన భాగం కల్పించనున్నారు. రూ.300, రూ.100, ఉచిత దర్శనం, వీఐపీ, వీవీఐపీ, దర్శనాలు, చంటిబిడ్డతల్లి, వృద్ధులకు ప్రత్యేక క్యూలను ఏర్పాటు చేసి దర్శన భాగ్యం కల్పించనున్నారు.

నేడు మడిభిక్షాల కోలాహలం

జాతరలో భాగంగా బుధవారం వెంకటగిరిలో చిన్నారులు, మహిళల మడిభిక్షాలతో కోలాహలం నెలకొననుంది. పోతురాజుకు పొంగలి పెట్టండి..పగలకపోతే..నా నెత్తిన కొట్టండి అంటూ వేపాకు తోరణాలు నడుంకు కట్టుకొని వేయికళ్ల తలపై పెట్టుకొని ఇంటింటా తిరుగుతూ భిక్షాటన చేస్తారు. దీంతో పట్టణంలో ఎక్కడ చూసినా మడిభిక్షలతో కోలాహలంగా మారుతుంది.

నిఘా నీడలో జాతర



మాట్లాడుతున్న సీఐ రమణ

వెంకటగిరి(సైదాపురం): సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిఘానీడలో జాతరను నిర్వహిస్తున్నట్లు వెంకటగిరి సీఐ ఏవీ రమణ తెలిపారు. పట్టణంలోని పింజల వీరయ్య కల్యాణ మండపంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేలా గూడూరు డీఎస్పీ వీవీ రమణ పర్యవేక్షణలో 1,250 మంది పోలీసులను బందోబస్తుకు నియమించామన్నారు. 25వ తేదీ అర్ధరాత్రి నుంచి 26వ తేదీ 7గంటల వరకు నాలుగు చక్రాల వాహనాలను పట్టణంలోకి అనుమతించమన్నారు. పట్టణం అంతా 104 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ మేరకు జాతర సజావుగా సాగేందుకు ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు. ఎస్ఐలు సుబ్బారావు, జిత్యానాయక్ పాల్గొన్నారు.

జాతరకు సంబంధించి రూట్ మ్యాప్‌ను అధికారులు విడుదల చేశారు.

అమ్మవారి టికెట్ల విక్రయాలు ప్రారంభం..

అమ్మవారి దర్శన భాగ్యం టికెట్ల విక్రయాలను వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ముందుగా టికెట్లను కొనుగోలు చేసి విక్రయాలను ప్రారంభించారు. రూ.300, 100 టికెట్లను పట్టణంలోని పలుచోట్ల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసి భక్తులకు అందుబాటులో ఉంచనున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాసులరెడ్డి తెలిపారు.

పగటి వేషగాళ్ల సందడి

పట్టణంలో చిరు వ్యాపారులు, పగటి వేషగాళ్ల సందడి నెలకొంది. పగటి వేషగాళ్ల పలురకాల వేషధారణలు ధరించి కనువిందుచేస్తున్నారు.



తలపై పోలేరమ్మను పెట్టుకున్న యువతి



వివిధ వేషధారణలో కళాకారుల ప్రదర్శన



పోలేరమ్మ ఆలయానికి వెళుతున్న భక్తులు

విద్యార్థికి ఆర్థికసాయం

వాకాడు: మండలంలోని బాలిరెడ్డిపాళెం పట్టాభి రామాలయంలో మంగళవారం సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో మహేష్ అనే విద్యార్థికి ఆర్థికసాయం అందజేశారు. ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నెల్లూరు జిల్లా కోవూరు ప్రాంతానికి చెందిన ధరణికోట మహేష్ అనే విద్యార్థికి తన చదువుల నిమిత్తం నాగలాపురం గిరిధర్‌రెడ్డి, మహేశ్వరమ్మ దంపతులతోపాటు ఉప్పల సాంబశివరావుల దాతృత్వంతో రూ.6వేలను ఆర్థిక సాయంగా మహేష్‌కు అందజేశారు.

పాస్‌పోర్టు ఇచ్చేందుకు నగదు డిమాండ్

నాయుడుపేటటౌన్: పోస్టల్ శాఖకు ఈనెల 21 తేదీన వచ్చిన పాస్‌పోర్టు ఇవ్వకుండా పోస్టుమన్ నగదు డిమాండ్ చేస్తున్నట్లు నల్లరెడ్డి చంద్రమౌళిరెడ్డి మంగళవారం విలేకరులకు ఎదుట వాపోయాడు. పాపారెడ్డికండ్రిగ గ్రామానికి చెందిన చంద్రమౌళిరెడ్డికి చెందిన పాస్‌పోర్టు ఈనెల 21 తేదీ నాయుడుపేట పోస్టాఫీస్‌కు వచ్చినట్లు ఫోన్‌కు మెసేజ్ వచ్చిందని తెలిపారు. అయితే అన్నమేడు బ్రాంచ్ పోస్టమన్ పాస్‌పోర్టు ఇవ్వకుండా లంచంగా రూ.2వేలు డిమాడ్ చేసినట్లు చంద్రమౌళి రెడ్డి వాపోయాడు. అన్నమేడు పోస్టుమాస్టర్‌కు చెప్పినా పాస్‌పోర్టు ఇవ్వలేదన్నారు. ఈవిషయమై నాయుడుపేట పోస్టుమాస్టర్ చంద్రశేఖర్‌ను వివరణ కోరాగా తనకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

కండలేరులో 18.936 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం 18.936 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 9,150 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. అలాగే సత్యసాయిగంగ కాలువకు 1,150, పిన్నేరు కాలువకు 40, హైలెవల్ కాలువకు 120, లోలెవల్ కాలువకు 20 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యం

డక్కిలి: అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే లక్ష్యంగా టీడీపీ ప్రభుత్వం పనిచేస్తుందని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. మండలంలోని శ్రీపురం సచివాలయంలో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో నూతనంగా సచివాలయం అదనపు భవనాలను ప్రారంభించారు. వ్యవసాయశాఖ అధికారులతో కలసి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్నారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహించి, వారికి పౌష్టికాహారం అందించారు. ఎంపీపీ గోను రాజశేఖర్, టీడీపీ మండల అధ్యక్షుడు పి.కోటేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు వెంకటత్నమ్మ, విజయమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు రాధారాణి, ఏ.రామచంద్రనాయుడు, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ ప్రసన్నకుమారి, ఎంఈఓలు వెంకటేశ్వర్లు, జగదీష్, ఐసీడీఎస్ సీడీపీఓ శంషాద్ బేగం, సూపర్‌వైజర్ పరిమళ, ఏఈఈలు రాజా, అశోక్, చంద్రశేఖర్, నాగరాజు పాల్గొన్నారు.

పోషకాహార ప్రాముఖ్యతపై సదస్సులు



శ్రీపురంలో సీమంతాలు నిర్వహిస్తున్న ఎంపీడీఓ

నాయుడుపేటటౌన్: పోషకాహార ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించేలా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఉమామహేశ్వరి తెలిపారు. మండల పరిధిలోని కూచివాడ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం సీడీపీఓ సారథ్యంలో గర్భిణులకు సాముహిక సీమంతాలను నిర్వహించారు. వారికి పోషకాహారం అందించి సంప్రదాయబద్ధంగా సీమంతాలు జరిపారు. సూపర్‌వైజర్ మణెమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, నాగమణి, కృష్ణవేణి, కవిత పాల్గొన్నారు.



కూచివాడలో సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న సీడీపీఓ మహేశ్వరి

రైతాంగ సమస్యల పరిష్కారానికే పొలం పిలుస్తోంది



రాపూరులో కరపత్రాల ఆవిష్కరణ



తనియాలిలో అవగాహన



కోట మండలంలో అవగాహన

రాపూరు: రబీ సీజన్‌లో వరి పంటలు వేసే రైతులు తెగుళ్ల సోకకుండా చూడాలని వ్యవసాయాధికారి సోమసుందర్ అన్నారు. మండలంలోని సిద్దవరం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించి పోస్టర్లు ఆవిష్కరించారు. సర్పంచ్ పెంచలయ్య పాల్గొన్నారు.

తనియాలిలో..

దొరవారిసత్రం: తనియాలి గ్రామంలో మంగళవారం వ్యవసాయాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక రైతులకు 60 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను ఏడీఏ అనిత అందజేశారు. ఏఓ సుభాషిణి, హెచ్ఓ యామిని, సిబ్బంది షబీనా, యుగంధర్, వీఆర్వో మురళి పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన

కోట: మండలంలోని ఊనుగుంటపాళెం, గూడలి గ్రామాల్లో మంగళవారం వ్యవసాయశాఖ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ నిరంజన్‌కుమార్, వీఏఏ, వీఎఫ్ఏలు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో రైతుకు మేలు

పెళ్లకూరు: సేంద్రియ వ్యవసాయంతో భూసారం దెబ్బతినకుండా అధికదిగుబడితో రైతులకు మంచి లాభాలు దక్కుతాయని మండల వ్యవసాయ శాఖ అధికారి డాక్టర్ ప్రవీణ అన్నారు. మంగళవారం పుల్లూరు, ముమ్మారెడ్డిగుంట, నెలబల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్‌లు శ్రీనివాసులురెడ్డి, రాంబాబు, వీఏఏలు మణి, అశోక్ ,రైతులు పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

గూడూరురూరల్: రైతులు తాము సాగు చేస్తున్న పంటలను ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకుంటే ప్రభుత్వం నుంచి అందాల్సిన రాయితీలు అందే వీలుంటుందని మండల వ్యవసాయాధికారి రమేష్ తెలిపారు. మండలంలోని అయ్యవారిపాళెం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు పంటలపై అవగాహన కల్పించారు. డాక్టర్ సుదర్శన్, మహేష్‌కుమార్, వ్యవసాయ సహాయకులు గాయత్రి, ఏహెచ్ఏ శ్రీకాంత్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

నాయుడుపేటటౌన్: రైతులకు నకిలీ వరి విత్తనాలు విక్రయించినట్లు ఫిర్యాదులు అందితే ఆయా దుకాణాలపై చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి జె. గణేష్ అన్నారు. మేనకూరు, భీమవరం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.



పెళ్లకూరు మండలంలో..



నాయుడుపేటలో..

దాడి కేసులో నిందితుడికి రిమాండ్

దొరవారిసత్రం : దాడి కేసులో నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ అజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మోదుగులపాళెం ఎస్సీ కాలనీలో మూడు రోజుల క్రితం రెండు వర్గాలు ఘర్షణ పడ్డాయన్నారు. ఈ సందర్భంగా శాంతాలం మాధవయ్య అనే వ్యక్తి కత్తితో మాయారి సుబ్రమణ్యంపై దాడి చేసినట్లు వెల్లడించారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

సమస్యల పరిష్కారానికి చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

సూళ్లూరుపేట రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం మండలంలోని కోటపోలూరులో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎమ్మెల్సీ వాకాటితో కలిసి ఆయన పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పులికాట్, పేర్నాడు రోడ్డు, ఇరకం దీవి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ చంద్రముని పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం



కలవకొండ వద్ద రోడ్డుకు అడ్డంగా వేరుశనగ కట్టె

చిల్లకూరు: తీర ప్రాంతంలో సాగు అనంతరం మిగిలిన వేరుశనగ కట్టె మంగళవారం ట్రాక్టర్‌లో తీసుకెళుతుండగా కలవకొండ వద్ద వేరుశనగ కట్టె రోడ్డుపై పడిపోవడంతో అరగంటకు పైగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తిక్కవరానికి చెందిన రైతులు వేరశనగ కట్టెను ట్రాక్టర్‌లో తీసుకెళుతుండగా కలవకొండ వద్దకు వచ్చే సరికే గంతలమయంగా ఉన్న రోడ్డుపై ట్రాలీలోని వేరుశనగ కట్టె రోడ్డుపై అడ్డంగా పడిపోయింది. దీంతో రెండు వైపులా రాకపోకలు అరగంటకు పైగా నిలిచిపోయాయి. గ్రామంలోని రైతులు అక్కడికి వచ్చి ట్రాలీని వేరు చేసి రాకపోకలను పునరుద్ధరించారు.

ఉపాధ్యాయులకు సత్కారం



సన్మాన గ్రహీతలతో ఏపీటీఎఫ్ నేతలు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని బుజ్జమ్మ సత్రం వద్ద ఏపీటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన సూరం మధుసూదన్‌ను ఘనంగా సత్కరించారు. అలాగే దొరవారిసత్రం మండలం ఏకొల్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చందా నరసింహారావు, విశ్రాంత ఉపాధ్యాయులు కేవీ రమణారెడ్డిని సైతం సన్మానించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు బాలసుబ్రమణ్యం, హరి, ప్రసాద్, అల్లెయ్య, రాజేష్, రజని బాబు పాల్గొన్నారు.